జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
నల్గొండ
సూర్యాపేట - యాదాద్రి భువనగిరి
ఆదివారం 13 సెప్టెంబర్ 2026 పేజీలు:16





## లోక్ అదాలత్‌తో పేద, బలహీన వర్గాలకు సత్వర న్యాయం

- కోర్టుల చుట్టూ తిరిగి సమయం, ధనం వృథా చేసుకోవద్దు: జూనియర్ సివిల్ జడ్జి

**తుంగతుర్తి, సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి):**
పేద బడుగు బలహీన వర్గాలకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జూనియర్ సివిల్ జడ్జి ఎండి గౌస్ పాషా పేర్కొన్నారు.


వివరాలు 2లో


# పాతాళంలో నీళ్లు... ఎండుతున్న బోర్లు

- మండలం లో కరువు ఛాయలు..
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- కానరాని చినుకు జాడ
- అంకెల సాక్షిగా కరువు తీవ్రత

**చింతలపాలెం, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి) :**
చింతలపాలెం మండలంలో భూగర్భ జలాలు నానాటికీ అడుగంటుతున్నాయి. వర్షాకాలం ముగుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో ప్రతికూల మార్పులు చోటుచేసుకోవడం, సెప్టెంబర్ నెలలోనూ చినుకు జాడ లేకపోవడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సాధారణంగా వేసవిలో సైతం10 మీటర్ల లోతులో నీరు లభ్యమయ్యే ప్రాంతాల్లో..

మిగతా 2 లో






# లో--వోల్టేజ్‌తో రైతుల గోస.. "బీజేపీ మహా ధర్నా"

- జలాల్‌పూర్ సబ్‌స్టేషన్ ఎదుట భారీ నిరసన

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**
మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర లో-వోల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం జలాల్‌పూర్ సబ్‌స్టేషన్ ఎదుట మహా ధర్నా నిర్వహించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడి పిలుపు మేరకు రూరల్ అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు డబ్బుకారు సాహెష్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నిరసన చేపట్టారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్ హాజరై మాట్లాడారు.

మిగతా 2 లో

# పాతాళంలో నీళ్లు... ఎండుతున్న బోర్లు

మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతం ఏకంగా 35 మీటర్లకు పైగా భూగర్భ జలాలు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ బావులు, బోర్లు పూర్తిగా ఎండిపోయి సాగు ప్రశ్నార్థకంగా మారింది. దీంతో భవిష్యత్తులో తాగునీటికి కూడా


### అంకెల సాక్షిగా కరువు తీవ్రత

ఈ ఏడాది (2026) మండలంలో వర్షాభావ పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉన్నాయో వర్షపాత వివరాలే స్పష్టం చేస్తున్నాయి. సీజన్ ప్రారంభమైన జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఏ ఒక్క నెలలోనూ వరుణుడు కరుణించలేదు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 80.4 మిల్లీమీటర్లు నమోదు కావాల్సి ఉండగా, కేవలం 42.4 మిల్లీమీటర్లు కురిసి 47 శాతం లోటు ఏర్పడింది. ఇక వ్యవసాయానికి అత్యంత కీలకమైన జూలై నెల రైతులను నిలువునా ముంచేసింది. 139.1 మిల్లీమీటర్ల భారీ వర్షం కురవాల్సిన ఆ నెలలో అత్యల్పంగా 7.7 మిల్లీమీటర్లు మాత్రమే నమోదు కావడం గమనార్హం. ఏకంగా 94 శాతం లోటు ఏర్పడటంతో ఆరంభంలోనే సాగుకు గండిపడింది. ఆగస్టు నెలలో కొంతమేర (126.5 మి.మీ) వర్షం కురిసినప్పటికీ 21 శాతం లోటు తప్పలేదు. ఇక ప్రస్తుత సెప్టెంబర్ నెల సగం ముగుస్తున్నా (సాధారణం 49.7 మి.మీ కాగా, నమోదైంది 10.2 మి.మీ) 79 శాతం లోటు రికార్డు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. సీజన్ ఆసాంతం చినుకు జాడ కరువవడంతోనే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఈ సంవత్సరం అత్యధికంగా 13 వేల ఎకరాల్లో పత్తి, 6 వేల ఎకరాల్లో మిరప సాగైంది. ఎకరాలకు ఎకరాలు కౌలుకు తీసుకుని, వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి వాణిజ్య పంటలు వేసిన రైతులు.. ఇప్పుడు చుక్క నీరు లేక కళ్లెదుటే పంట ఎండుతుంటే కన్నీరు పెడుతున్నారు.

### కలవరపెడుతున్న 'శివగంగ' వైఫల్యం

వర్షాభావ పరిస్థితుల్లో ఆదుకుంటుందని భావించిన 'శివగంగ లిఫ్ట్' సైతం అన్నదాతలను తీవ్రంగా నిరాశపరుస్తోంది. తరచూ పైపులు పగలడం, ఒకచోట బాగుచేసేలోపే మరోచోట లీకేజీలు రావడం నిత్యకృత్యంగా మారింది. దీంతో ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యం నీరుగారిపోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్న విపత్కర పరిస్థితుల్లో, ప్రత్యామ్నాయ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

### ముంచుకొస్తున్న ముప్పు




భారీ వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండితే తప్ప భూగర్భ జలాలు పెరిగే అవకాశం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో సాగునీటికే కాకుండా తాగునీటికీ తీవ్ర ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. పంటల ఎదుగుదలకు కీలకమైన ప్రస్తుత తరుణంలో నీటి కొరత రైతుల పాలిట శాపంగా మారింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిస్థితిని సమీక్షించాలని, శివగంగ లిఫ్ట్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి మండలంలోని నీటి వనరుల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# లోక్ అదాలత్‌తో పేద, బలహీన వర్గాలకు సత్వర న్యాయం

మొదటిపేజీ తరువాయి

శనివారం తుంగతుర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులను ఉద్దేశించి జడ్జి మాట్లాడుతూ.. పేదలు, బలహీన వర్గాలకు న్యాయం అందించడంతో పాటు, ఎలాంటి అధిక ఖర్చులు లేకుండా వివాదాలను రాజీ మార్గంలో పరిష్కరించి సమాజంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడమే లోక్ అదాలత్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 39-ఏ స్ఫూర్తితో న్యాయం అందరికీ సమానంగా అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో లోక్ అదాలత్ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 1985లో లోక్ అదాలత్ వ్యవస్థకు ప్రాధాన్యం ఏర్పడిందని పేర్కొన్నారు.క్షణికావేశంలో చిన్నచిన్న వివాదాలు పెద్ద సమస్యలుగా మారి సొంత అన్నదమ్ములు సైతం ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. కొట్టుకోవడం, గాయపరచుకోవడం, హత్యలకు దారితీసే ఘటనలు చోటుచేసుకోకుండా వివాదాలను ప్రారంభ దశలోనే సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.కక్షిదారులు సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ తమ విలువైన సమయం, ధనం వృథా చేసుకోకుండా, పరస్పర అంగీకారంతో వివాదాలకు పరిష్కారం పొందేందుకు లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని తెలిపారు. ఇరుపక్షాల సమ్మతితో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం ద్వారా కుటుంబాలు, వ్యక్తుల మధ్య నెలకొన్న విభేదాలకు ముగింపు పలకవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ. జ్ఞానసుందర్, జనరల్ సెక్రటరీ కె. వెంకటేశ్వర్లు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎస్కే. వజీర్, బి. వేణురాజ్ ప్రతాప్, బి. సతీష్, వి. నాగారాజు, ఒర్సు రాజు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



# లో--వోల్టేజ్‌తో రైతుల గోస.. "బీజేపీ మహా ధర్నా"

మొదటిపేజీ తరువాయి

లో-వోల్టేజ్ కారణంగా రైతులు వ్యవసాయ మోటార్లు నడపలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంలో ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయరాదన్నారు.



ధర్నాలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీ రాజేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చెరుకు వెంకటేశం, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గంజి బసవలింగం, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సీత మానస, కౌన్సిలర్ శ్రీరామ్ మంజుల లింగస్వామి, రచ్చ సత్యనారాయణ, బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గుడిపల్లిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ విజయవంతం
# 500 మందికి కార్పొరేట్ వైద్య సేవలు

- సర్పంచ్ కూన్రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు - సహకారం అందించిన ప్రముఖ యశోద హాస్పిటల్' వైద్య బృందం - ఉచితంగా పరీక్షలు, మందులు మరియు కళ్లద్దాల పంపిణీ
- యశోద హాస్పిటల్ వైద్యంలో 20 శాతం ప్రత్యేక డిస్కౌంట్ ప్రకటన

**దేవరకొండ, సెప్టెంబర్ 12, (ప్రజా జ్యోతి) :**






ప్రజా ఆరోగ్యమే పరమావధిగా గుడిపల్లి గ్రామ సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో, ప్రముఖ యశోద హాస్పిటల్ సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ శుక్రవారం అత్యంత విజయవంతంగా ముగిసింది. గుడిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా జరిగిన ఈ శిబిరంలో దాదాపు





500 మంది గ్రామస్తులు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఈ హెల్త్ క్యాంప్‌లో యశోద హాస్పిటల్స్ నిపుణులైన డాక్టర్ వీరారెడ్డి, ఆర్థో నిపుణులు డాక్టర్ అమీరా, గైనకాలజిస్ట్ డాక్టర్ మధుర దుర్గా మరియు వారి ప్రత్యేక వైద్య బృందం రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు అందించారు. ఉచిత సేవలు మరియు మందుల పంపిణీ శిబిరానికి వచ్చిన ప్రజలకు కంటి పరీక్షలు, గర్భిణీ స్త్రీలకు గైనక్ పరీక్షలతో పాటు ఈసీజీ , బీపీ మరియు షుగర్ పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం బాధితులకు అవసరమైన కళ్లద్దాలను, మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. అంతేకాకుండా, ఈ క్యాంప్‌లో పరీక్షించుకున్న వారిలో ఎవరికైనా పెద్ద ఆరోగ్య సమస్యలు ఉండి, ఇక్కడ ఇచ్చిన ఒపి స్లిప్‌తో యశోద హాస్పిటల్‌కు వస్తే వైద్య ఖర్చులలో 20% రాయితీ ఇస్తామని వైద్యులు హామీ ఇచ్చారు.ముందు జాగ్రత్త చర్యగా ఆరోగ్య రక్షణ ఈ సందర్భంగా సర్పంచ్ కూన్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. మా గ్రామ ప్రజల ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధతో తాము అడగగానే స్పందించి, ఉచితంగా ఈ మెగా క్యాంప్ నిర్వహించడానికి ముందుకు వచ్చిన యశోద హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్య బృందానికి ప్రత్యేక కృతజ్ఞతలు. ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకూడదనే ముందు జాగ్రత్తతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రజారోగ్యంతో పాటు విద్యార్థుల పౌష్టికాహారం కోసం మా పాఠశాల పిల్లలకు ప్రతి వారం చికెన్ కూడా అందిస్తున్నాం అని తెలిపారు.గ్రామ ప్రజల కోసం ఇంతటి బృహత్తర ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్ రాజశేఖర్ రెడ్డిపై మరియు సేవలు అందించిన యశోద హాస్పిటల్ వైద్యులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## వి ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి చండీశ్వర్ క్రీడలో విశేష ప్రతిభ

**ఆలేరు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో వి ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థి బైరి చండీశ్వర్ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచి అండర్ 17 జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కబడి వాలీబాల్ విభాగాల్లో జిల్లా స్థాయికి ఎంపిక కావడంతో పాటు 100 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. చండీశ్వర్ సాధించిన విజయాల పట్ల కళాశాల ప్రిన్సిపాల్ నాలం అయ్యప్ప వైస్ ప్రిన్సిపల్ రాజు హర్షం వ్యక్తం చేసి విద్యార్థిని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలోను ప్రతిభ కనబరచడం అభినందనీయం అని భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం చండీశ్వర్ ను శాలువతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పరశురాములు లావణ్య మధుసూదన్, వీరాచారి కమలాకర్ సునంద కృష్ణ ఉప్పాచారి రమేష్ ఇందిరా లావణ్య నమీర జాస్మన్ ఆంజనేయులు సింధు నర్మదా తదితరులు పాల్గొన్నారు.



## కరెంట్ షాక్ తగిలి మేకలు మృత్యువాత

**ఆలేరు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**





యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండలం గిరిబోయిన గూడెం గ్రామానికి చెందిన అంగడి యాదగిరి, బోట్ల యాదయ్యలకు చెందిన మూడు మేకలు శనివారం గ్రామ శివారులో రోజులాగే మేత మేస్కుంటూ వెళ్లి ట్రాన్స్ఫారం పక్కన ఉన్న కరెంటు తీగలకు తగిలగా కరెంటు షాక్ రావడంతో అక్కడికక్కడే మేకలు చనిపోయాయి. ఒకసారి మేకలు లేవని కాపరి చూడడంతో మృత్యువాత పడ్డ మేకల్ని చూసి లబోదిబోమని ఏడ్చాడు. ఒక క్షణంలో మేకలు కరెంటు షాక్ తగిలి చనిపోవడం తో నేల మీద కుప్పకూలిపోయాడు. వాటి విలువ 60 వేల రూపాయలు ఉంటాయి. ప్రభుత్వం మేకల కాపర్లను ఆదుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# ప్రపంచ మానవాళికి ఆదర్శం మొహమ్మద్ ప్రవక్త

## మమ్మద్ ప్రవక్త సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలి





**భువనగిరి,సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)**

మక్కా మసీదు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన,సిరతున్ నబి జల్సా కార్యక్రమం పహాడీ నగర్ మక్కా మసీదులో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు రావడం జరిగింది అలాగే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తెలంగాణ ఆంధ్రప్రదేశ్ జమ్మియతుల్ ఉలేమా ఎ హింద్ ప్రధాన కార్యదర్శి ముఫ్తీ మహమూద్ జుబేర్ కాస్మి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త(స) ఈ లోకంలో మానవాళికి జాతి కుల వర్గ భాష భేదాలు ఏమీ లేకుండా మానవు లంతా సమానమే అని చాటి చెప్పారు ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టాలని ఆదరించాలని మానవు లంతా,మమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సూచించిన అడుగుట జాడల్లో నడవాలని శత్రువులను సైతం ప్రేమించే గుణం ఉన్న వ్యక్తి మహమ్మద్ ప్రవక్త గారు అని శాంతి మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని ప్రపంచ మానవాళికి ఆయన సూచన చేశారు అన్యాయాన్ని ఎదిరించి న్యాయం కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి మహమ్మద్ ప్రవక్త అని ఇస్లాం అంటేనే శాంతి అని శాంతి అంటేనే ఇస్లామని ఆయన సూచించారు పేదవారి పట్ల దయ చూపండి అని ఆకాశంలో ఉన్న దేవుడు మీపై దయ చూపుతాడని మానవులలో అందరికంటే గొప్పవాడు ఇతరులకు ఉపయోగపడే వాడని మహమ్మద్ ప్రవక్త గారు సూచించారు. ఈ కార్యక్రమంలో హజరత్ మౌలానా సయ్యద్ అక్బర్ సాహిబ్ ముఫ్తీ గయాసుద్దీన్ రహమాని సాహెబ్ మొహమ్మద్ హుషారుద్దీన్ సని సాహబ్ జాఫర్ పాషా సాహెబ్ ఫసియుద్దీన్ నద్వి సహబ్ థౌసీఫ్ సాహెబ్ ఫెరోస్ సహాబ్ సయ్యద్ బాకీ యాతుల్లా సహాబ్ ముఫ్తీ అజహార్ సాహెబ్ ఇమాదుల్ హసన్ సాహెబ్ తదితరులు పాల్గొనడం జరిగింది

# సమృద్ధిగా వర్షాలు కురవాలని దేవరకొండ ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు

**దేవరకొండ, సెప్టెంబర్ 12,( ప్రజా జ్యోతి) :**

సకాలంలో వర్షాలు కురిసి, రైతాంగం పచ్చని పంటలతో కళకళలాడాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ దేవరకొండ పట్టణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. దేవరకొండ ఈద్గా కమిటీ, మదర్స మిస్బా ఉల్ ఉలుమ్ మరియు జమీయత్ ఉలేమా ఏ హింద్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న ఆదివారం ఉదయం 8:00 గంటలకు స్థానిక ఈద్గా మైదానంలో వర్షాల కోసం ప్రత్యేక నమాజ్ ఎ ఇస్తిస్కా ప్రార్థనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, రైతుల సంక్షేమం మరియు రాష్ట్రంలో నెలకొన్న వర్షభావ పరిస్థితులు తొలగిపోవాలని అల్లాహ్ ను వేడుకునేందుకు ఈ ప్రత్యేక నమాజ్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలందరి సంక్షేమం, వ్యవసాయం వృద్ధి చెందడమే ఈ ప్రార్థనల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. దేవరకొండ పరిసర ప్రాంతాల్లోని ముస్లిం సోదరులందరూ ఈ పుణ్యకార్యంలో ఎటువంటి ఆలస్యం లేకుండా, సకాలంలో ఉదయం 8 గంటలకల్లా అధిక సంఖ్యలో పాల్గొని, ఈ ప్రత్యేక ప్రార్థనలను విజయవంతం చేయవలసిందిగా ఈద్గా కమిటీ విజ్ఞప్తి చేస్తోంది.



**కార్యక్రమ వివరాలు:**

వేదిక: ఈద్గా మైదానం, దేవరకొండతేదీ: ఈ నెల 13 ఆదివారం, సమయం: ఉదయం 8:00 గంటలకు

# ఆరోగ్య రక్షణే.. పోషణ మాసం లక్ష్యం



**గరిడేపల్లి,సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి):**

ఆహారంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే జీవితాంతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని అంగన్వాడీ టీచర్ పోకల వెంకమ్మ అన్నారు. గరిడేపల్లి మండలం గానుగబండ గ్రామంలో పోషణ మాస కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారం చేపట్టి గర్భిణులు,బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. స్థూల కాయం,మధుమేహం నివారణ కు ఉప్పు,చక్కెర,నూనె వినియో గాన్ని పరిమితం చేయడంతో పాటు జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ఇంట్లో నే తక్కువ ఖర్చుతో మునగాకు, పాలకూర పకోడీలు,పల్లీపట్టి, నువ్వుల ఉండలు వంటి పౌష్టి పదార్థాలను తయారు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జంగము అనిత,సత్యవతి గోవిందమ్మ, ఈద మమత,రెబ్బా మల్లీశ్వరి, జానపటి కామేశ్వరి,సురభి త్రివేణి,షేక్ ఇమాంబి ఈద అక్కమ్మ,షేక్ సైదాబీ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ చింతకింది మురారి కి ఘన సన్మానం

**ఆలేరు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ పద్మశాలి సంఘం వారు డాక్టర్ చింతకింది మురాహరి కి పరంపర్య వైద్య మహా సంఘం ఆధ్వర్యంలో శనివారం శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మురాహరి వారి సేవలను గుర్తించి అవార్డు ప్రధానం చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో చిక్క శ్రావణ్, బేథీ రాములు, ఆడెపు బాలస్వామి, సంతోష్ ,రవి , శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా "ఏర్పుల శ్రీనివాస్"

## కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం..

- ఏర్పుల శ్రీనివాస్

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**

మండలంలోని మెహర్‌నగర్ గ్రామానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పుల శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, బీర్ల ఐలయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పోచంపల్లి కాంగ్రెస్ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ పాక మల్లేష్ యాదవ్, కళ్లెం రాఘవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, పోచంపల్లి పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతుల వెంకటేశం యాదవ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కాసుల అంజయ్య, 2వ వార్డు కౌన్సిలర్ కొండమడుగు ఎల్లస్వామి, సామ మధుసూదన్ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, నల్లా నాగేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఏర్పుల శ్రీనివాస్ పేర్కొన్నారు.



# మట్టి గణపతినే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

## - మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్



**దేవరకొండ, సెప్టెంబర్ 12, (ప్రజా జ్యోతి) :**

వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి, పూజించాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన విగ్రహాలను చెరువులు, నదులు, ఇతర నీటి వనరుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీటి కాలుష్యం విపరీతంగా పెరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల జలచరాలతో పాటు పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని హెచ్చరించారు.మన ప్రకృతిని కాపాడుకోవడం అందరి ప్రాథమిక బాధ్యత అని రవీంద్ర కుమార్ పేర్కొన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన, కాలుష్య రహిత పర్యావరణాన్ని అందించేందుకు మట్టి గణపతి విగ్రహాలనే వినియోగించాలని సూచించారు. భక్తితో పాటు సామాజిక బాధ్యతను చాటుకుంటూ, పర్యావరణహితంగా వినాయక చవితి వేడుకలను నిర్వహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆయన ప్రజలను కోరారు.మట్టి గణపతినే పూజిద్దాండ పర్యావరణాన్ని కాపాడే యజ్ఞంలో భాగమవుదాండ ప్రకృతిని పరిరక్షిద్దాం.. భావితరాలను కాపాడుదాం అని ఆయన ఈ సందర్భంగా నినదించారు.

# రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించిన మున్సిపల్ సిబ్బంది

**ఆలేరు, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో శనివారం కురిసిన వర్షానికి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంది.విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ వెంటనే స్పందించి, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం నీటిని మురుగు కాలువల్లోకి మళ్లించాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.చైర్మన్ ఆదేశాలతో మున్సిపల్ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి డోజర్ సహాయంతో రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని డ్రైనేజీలోకి మళ్లించారు. ముఖ్యంగా బస్టాండ్ ముందు, రైల్వే గేట్ మూసికోల్ మోరి వద్ద రోడ్డుకు ఇరువైపులా నిలిచిన నీటిని తొలగించి, ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.మున్సిపల్ చైర్మన్ వెంటనే స్పందించి అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు ఇవ్వడంతో నీటిని తొలగించడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్9వ వార్డు పస్తం ఆంజనేయులు, రెండో వార్డ్ కౌన్సిలర్ వానరాశి మరియమ్మ మార్క్ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అమీనాబాద్ బీసీ కమ్యూనిటీ హాల్ కు స్థలం సేకరణ

## - 8 కుంటల ప్రభుత్వ స్థలాన్ని పంచాయతీ రాజ్ డీఈ కి అప్పగించిన రెవిన్యూ అధికారులు

**అనంతగిరి మండలం(ప్రజా జ్యోతి) అమీనాబాద్**

**సెప్టెంబర్ 12 2026**

అనంతగిరి మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తీర్మానం ఆమోదం పొందింది.తీర్మానం అనంతరం గ్రామంలోని 8 కుంటల ప్రభుత్వ స్థలాన్ని బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు ఆర్ఐ వెంకటనగేష్ హద్దులు కేటాయించి, పంచాయతీ రాజ్ డీఈ సాయిరాం కు అధికారికంగా అప్పగించారు.గ్రామస్తుల సహకారంతో స్థలాన్ని పరిశీలించి హద్దులు నిర్ణయించి అప్పగింత ప్రక్రియ పూర్తి చేశారు.అనంతరం పంచాయతీ రాజ్ డీఈ సాయిరాం మాట్లాడుతూ.. త్వరలోనే ఈ స్థలంలో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. సుమారు 15 లక్షల రూపాయల వ్యయంతో అధునాతన సౌకర్యాలతో ఈ హాల్ నిర్మాణం జరగనుందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ...తమ గ్రామానికి బీసీ కమ్యూనిటీ హాల్ మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్



కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో గ్రామంలోని బీసీలతో పాటు అన్ని వర్గాల వారికి శుభకార్యాలు, సమావేశాలకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి నరేష్, ఉప సర్పంచ్ కవిత, వార్డు సభ్యులు లక్ష్మణ్, లక్ష్మినారాయణ, వెంకటేశ్వర్లు, వెంకన్న, గ్రామస్తులు వీరబాబు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



# రైతాంగ పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి

## జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**అనంతగిరి మండలం శాంతినగర్(ప్రజా జ్యోతి)**

**సెప్టెంబర్ 12 2026**

అనంతగిరి మండలం శాంతినగర్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించి అమరవీరుల స్థూపాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, భూస్వామ్య, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతులు సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాల సాధనకు ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. రైతులు, కూలీలు, పేదల సమస్యలపై నిరంతరం పోరాడాలని అన్నారు. నేటి తరానికి రైతాంగ సాయుధ పోరాట చరిత్ర, అమరవీరుల త్యాగాలను వివరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బద్దం కృష్ణారెడ్డి, మండల కార్యదర్శి ఎర్రసాని రవి, దేగ వీరన్న, బత్తిని వీరబాబు, సర్పంచ్ వాడకొప్పుల ఉమ, ఉపసర్పంచ్ గరిడేపల్లి స్వాతి, నాగభద్రం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు చేరుకోవాలి

## - శ్రీ వైష్ణవి కళాశాల కరస్పాండెంట్ పడాల శ్రీనివాస్







**భువనగిరి,సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి)**

విద్యార్థులు పట్టుదలతో చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరి,ఆర్థికంగా అభివృద్ధి చెందాలని,శ్రీ వైష్ణవి కళాశాల కరస్పాం డెంట్ పడాల శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. శనివారం శ్రీ వైష్ణవి కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు భువనగిరి పట్టణంలోని స్థానిక ఎం ఎన్ ఆర్ గార్డెన్ లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, పట్టణంలో గత 12 సంవత్సరాల నుండి కళాశాలలో నడుపుతూ విద్యార్థుల ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తూ భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే విధంగా ఒక సముచిత స్థానాన్ని,అందిస్తుందని కళాశాలలో విద్యాభ్యాసం నేర్చుకున్న విద్యార్థులు ప్రస్తుతం ఉద్యోగాలు సంపాదించి మంచి,మంచి స్థానాలలో ఉన్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.రాష్ట్రంలో కళాశాలను అగ్ర స్థానంలో గుర్తింపు పొందే విధంగా తమ వంతు సహకారం అందిస్తున్నామని ఆయన తెలిపారు.అలాగే కళాశాల ప్రిన్సిపాల్ మధిర మల్లేశం మాట్లాడుతు విద్యార్థులు చెడు వ్యసనలకు దూరంగా ఉండి,బంగారు భవిష్య త్తును నాశనం చేసుకో వద్దని,పట్టుదలతో,పోటీ తత్వంతో మంచి మార్కులు సాధించి కళాశాల పేరు గుర్తింపు ఉండేలా తెచ్చుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ గడ్డం సోమ్ చంద్,అధ్యాపకులు, విద్యార్థి,విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 562 కేసుల పరిష్కారం

**నకిరేకల్, సెప్టెంబర్ 12: ప్రజా జ్యోతి**




మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ కోర్టు ఆవరణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు రికవరీ కేసుల్లో రూ.13.48 లక్షలు రికవరీ కాగా, సివిల్, క్రిమినల్, మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులు కలిపి మొత్తం 562 కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయ సేవా కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కుమారి మంజుల సూర్యావర్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చన్నారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఇరువర్గాల సమ్మతితో పరిష్కరిస్తామని తెలిపారు. కక్షిదారులు లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి జూనియర్ సివిల్ జడ్జి డి. సాయి మేఘన సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పూజర్ల శంబయ్య మాట్లాడుతూ రాజీమార్గం ద్వారా పరిష్కరించే కేసుల్లో అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండదన్నారు. రాజీ ద్వారా ఇరువర్గాలు విజయం సాధించినట్లేనని పేర్కొన్నారు.కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు కొండా యాదగిరి, వల్లెం ఉదయ్ కుమార్, చౌగోని నాగరాజు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# తోటి డ్రైవర్ కుటుంబానికి అండగా

**గరిడేపల్లి,సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి):**

తోటి డ్రైవర్ కుటుంబానికి అండగా నిలిచి లారీ డ్రైవర్లు మానవత్వం చాటుకున్నారు. రాయినిగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గుండు లింగరాజు పది రోజుల క్రితం వృత్తి నిమిత్తం డ్యూటీకి వెళ్లి,మార్గమధ్యంలో రాత్రి నిద్రిస్తున్న సమయంలో హీట్‌స్ట్రోక్‌కు గురై మృతి చెందారు.లింగరాజు పెద్దదినం కార్యక్రమంలో పాల్గొన్న తోటి డ్రైవర్లు రూ.1.20 లక్షల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అంజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అండగా నిలిచిన డ్రైవర్లను గ్రామస్థులు అభినందించారు.ఈకార్యక్రమంలో కొండ సైదులు,గుండు సైదులు,లక్ష్మీనారాయణ, అజయ్,నాగేంద్రబాబు, నాగరాజు,ఆకుల గోపీచంద్,వేణు,గోపి తదితరులు పాల్గొన్నారు.



# అందే అంజయ్య మృతి సిపిఎం పార్టీకి తీరని లోటు

## కల్లూరి మల్లేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

**ఆలేరు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**



యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం తూర్పు గూడెం గ్రామ శాఖ కార్యదర్శి సిపిఎం మండల నాయకులు అందే అంజయ్య శనివారం ఉదయం తెల్లవారు జామున గుండెపోటుతో మరణించడం జరిగిదూ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కల్లూరు మల్లేశం అందే అంజయ్య గారి భౌతిక దేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందే అంజయ్య గారు నిరంతరం కార్మికులు పేదల పక్షాన సిపిఎం పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపులో ముందుండి నడిచేవారని వారు లేని లోటు పార్టీకే కాకుండా పేద వర్గాలకు కూడా తీరనిలోటు అన్నారు. పేదలు కార్మికులు కర్షకుల కోసం పోరాటాలు నిర్వహించడమే అందే అంజయ్య గారికి నిజమైన నివాళి అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ ,సిపిఎం మండల కార్యదర్శి దూపటి వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జూకంటి పౌలు ,సిఐటియు జిల్లా నాయకులు మోరిగాడి రమేష్ ,సూద గాని సత్య రాజయ్య ,నల్ల మాస తులసయ్య ,మిట్ట శంకరయ్య, సంఘీ రాజు ,బాల్ నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కౌన్సిలర్లకు సన్మానం

**ఆలేరు సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలోని తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆలేరు మున్సిపాలిటీకి చెందిన పద్మశాలి కౌన్సిలర్ పాసికంటి సంపత్, బోట్ల సంపత్ కి శనివారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి భవనంలో శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలోఆలేరు పద్మశాలి సంఘం నాయకులు ఉన్నారు.



# చంచల్ మిట్టల్ జయంతి సందర్భంగా విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**ఆలేరు, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ హాస్టల్‌లో శనివారం సేవా కార్యక్రమం నిర్వ హించారు. సామాజిక వేత్త శ్రీమతి చంచల్ మిట్టల్ జయంతి సందర్భంగా దీన శరణ్య స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హాస్టల్ విద్యార్థినులకు బహుమతులు, స్టడీ మెటీరియల్ అందజేశారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న బాలికలకు పుస్తకాలు, తదితర స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతల సాయి బాబా మాట్లాడుతూ బాలికలకు క్రమశిక్షణ పట్టుదల లక్ష్యం ఏర్పాటు చేసుకొని ఉన్నత ఉద్యోగాలు ఐఏఎస్, ఐపీఎస్, ఐఐటి ,నీట్ ఎగ్జామ్స్ పాస్ కావాలంటే లక్ష్యం ఏర్పాటు చేసుకొని సమయపాలన క్రమశిక్షణ దృష్టిలో పెట్టుకొని ఏకాగ్రతతో చదివినట్లయితే ఉన్నత లక్ష్యాలు చేరుకుంటారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు అయితె వెంకటేష్ హాజరయ్యారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్. శైలజ, దీన శరణ్య స్వచ్ఛంద సంస్థ చైర్మన్ చింతల సాయిబాబా, హాస్టల్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఎంబిబిఎస్ సీట్లు సాధించిన పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

**పెన్ పహాడ్ సెప్టెంబరు 12. (ప్రజా జ్యోతి)**

పెన్ పహాడ్ మండలం అనంతా రం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు బీపంగ యశ్వంత్ మామిడి ఇందు లు (నీట్ లో) ఎం బి బి ఎస్ సీట్లు సాధించినందుకు వారికి శనివారం సూర్యాపేటకు చెందిన విజయకృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు చెందిన డాక్టర్ మిన్న శివరామకృష్ణ. డాక్టర్ విజయలక్ష్మి దంపతులు ఈ నిరుపేద ఇద్దరి విద్యార్థులకు కలిపి 50వేల రూపాయలు. ఆర్థిక సహాయం అందించారు. మొదటి సంవత్సరానికి ఉపయోగపడే పుస్తకాలను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మిన్న శివరామ కృష్ణ.విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ...బీపంగ యశ్వంతు నీట్ లో 1301 ర్యాంకు సాధించి ఉస్మానియాలో.. మామిడి ఇందు నీట్ లో 10150 ర్యాంక్ సాధించి గాంధీ హాస్పటల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించటం అభినందనీయమన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ఉన్నత వైద్య విద్యలో సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ద్వితీయ తృతీయ సంవత్సరాలలో కూడా ఇరువురి విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. యశ్వంతు. ఇందు లు మాట్లాడుతూ,వైద్య విద్యను విజయవంతంగా పూర్తి చేసి నిరుపేదలకు వైద్యాన్ని సకాలంలో అందించేందుకు కృషి చేస్తామన్నారు.



# యువత జాబు మేళాను వినియోగించుకోవాలి – శ్రావ్య సుధీర్ రెడ్డి

**పెన్ పహాడ్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో ఈ నెల 19న నిర్వహించనున్న భారీ "మెగా జాబ్ మేళా"ను జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద ఎత్తున సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షురాలు సంకరమద్ది శ్రావ్య సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతి సూచనలతో, కాంగ్రెస్ ఏఐసీసీ సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో కోదాడలోని సిసి రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో ఈ ఉపాధి నియామక కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆమె కొనియాడారు. ఈ నెల 19న ఉదయం 8:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో దేశంలోని వివిధ రంగాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీలు, పరిశ్రమలు పాల్గొంటున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతీ యువకులు అందరూ దీనికి అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థుల నైపుణ్యాల ఆధారంగా ఆయా కంపెనీలలో నేరుగా ఇంటర్వ్యూల ద్వారా తక్షణ కెరీర్ అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు.నిరుద్యోగ యువత ఎలాంటి మధ్యవర్తులను నమ్మకుండా, నేరుగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి ఉద్యోగాలు పొందేందుకు ఇదొక సువర్ణావకాశమని ఆమె



అన్నారు. అభ్యర్థుల నమోదు ప్రక్రియ కోసం ప్రాంగణంలో ప్రత్యేక రిజిస్ట్రేషన్ సహాయక కౌంటర్లు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి నిరుద్యోగికి ఈ సమాచారం చేరేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. సూర్యాపేట జిల్లాలోని నిరుద్యోగ యువత తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, బయోడేటా వంటి పూర్తి వివరాలతో సకాలంలో హాజరై, ఈ అవకాశాన్ని చేజార్చుకోకుండా విజయవంతం చేయాలని శ్రావ్య సుధీర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బస్టాండ్ దొంగల ముఠాకు పోలీసుల చెక్

- మూడు చోరీ కేసులు ఛేదింపు.. రూ.7 లక్షల విలువైన బంగారం స్వాధీనం
- అంతర్రాష్ట్ర ముఠాలో ముగ్గురి అరెస్ట్..

మరోసారి చోరీకి వచ్చి పోలీసులకు చిక్కిన వైనం





**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 12,(ప్రజాజ్యోతి):**

ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని బస్టాండ్‌లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు కొండమల్లేపల్లి పోలీసులు చెక్ పెట్టారు. పక్కా సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, మరోసారి నేరానికి పాల్పడేందుకు వచ్చిన ముగ్గురు నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. నేరాలకు ఉపయోగించిన ఆటో, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌ను సీజ్ చేశారు.కొండమల్లేపల్లి సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు ఈ ఏడాది మార్చి నుంచి జూలై వరకు కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో మూడు చోరీలకు పాల్పడినట్లు గుర్తించారు. బస్సులు ఎక్కే సమయంలో ప్రయాణికుల రద్దీని అనుకూలంగా మార్చుకుని, వారి వద్ద ఉన్న బంగారు ఆభరణాలను అపహరించేవారని తెలిపారు.బస్టాండ్‌లో వరుసగా జరుగుతున్న చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డీఎస్పీ ఆదేశాల మేరకు సీఐ, ఎస్ఐ ఆధ్వర్యంలో క్రైమ్ సిబ్బంది నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శనివారం మరోసారి చోరీకి పాల్పడేందుకు వచ్చిన ముఠాను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గతంలో జరిగిన మూడు చోరీలకు సంబంధించిన వివరాలు వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.అరెస్టయిన వారిని నెల్లూరు జిల్లా జొన్నవాడకు చెందిన సింది తిరుపతమ్మ అలియాస్ యేజి తిరుపతమ్మ (39), వానరవి కేశవ అలియాస్ జషువా (24), వానరవి జ్యోతి (24)గా గుర్తించారు. వీరికి గతంలో తిరుపతి, కావలి, కర్నూలు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ చోరీలకు పాల్పడిన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.కొండమల్లేపల్లి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన క్రైం నంబర్లు 70/2026, 146/2026, 147/2026 కేసులను పోలీసులు ఛేదించారు. బీఎన్ఎస్ చట్టంలోని 303(2) సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను దేవరకొండ న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.బస్టాండ్‌లో బస్సులు ఎక్కే సమయంలో రద్దీని ఆసరాగా చేసుకునే దొంగల పట్ల ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి. బంగారు ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని పోలీసులు సూచించారు.ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠాపై ప్రత్యేక నిఘా పెట్టి, మరోసారి నేరానికి వచ్చిన సమయంలోనే పట్టుకోవడంపై కొండమల్లేపల్లి పోలీసుల అప్రమత్తతకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన సీఐ, ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుల్ జె. కరుణాకర్, కానిస్టేబుళ్లు వి. స్వామినాయక్, జి. భాస్కర్, సిహెచ్. రాంబాబు, సిహెచ్. శేఖర్‌రెడ్డి, మహిళా కానిస్టేబుల్ ఐ. నాగసంధ్య, హెచ్‌జీ శేఖర్‌లను డీఎస్పీ ఎం.వి. శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

# సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టం

## సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి

**వలిగొండ, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**

మాజీ సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మేధావి అని, ఆయన మరణం భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. శనివారం వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం వద్ద సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. దేశాన్ని పట్టిపీడిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని కొనియాడారు. యూపీఏ మొదటి ప్రభుత్వంలో ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టం, సమాచార హక్కు చట్టం వంటి ప్రజా ప్రయోజన చట్టాల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. విద్యార్థి ఉద్యమం నుంచి యువజన, కార్మిక, ప్రజా పోరాటాల వరకు నాలుగు దశాబ్దాలుగా దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారని అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రజా సమస్యలపై పోరాడి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంలో విశేష కృషి చేశారని గుర్తుచేశారు. సీతారాం ఏచూరి ఆశయాల సాధన కోసం మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కూర శ్రీనివాస్, దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ, నాయకులు వేముల లక్ష్మయ్య, కొండూరు సత్తయ్య, శీలం ఇందిర, ధ్యానబోయిన యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# భూ, ఇంటి వివాదమే హత్యకు కారణం!

- డి.కొత్తపల్లి శివారులో ఘటన.. ముగ్గురు నిందితులు అరెస్ట్

- కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించిన నాగారం పోలీసులు

**నాగారం, సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి):**

నాగారం మండలం డి.కొత్తపల్లి గ్రామ శివారులోని ఎస్ఆర్ఎస్పీ కాలువ రోడ్డుకు సమీపంలో జరిగిన హత్య కేసులో ముగ్గురు నిందితులను నాగారం పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. నాగారం సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగేశ్వరావు, ఎస్సై చిరంజీవితో కలిసి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 9న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన బయ్యాం యాకస్వామి హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు నాగారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా మృతుడికి నిందితులకు మధ్య గతంలో భూమి, ఇంటి విషయాలకు సంబంధించి వివాదాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే బయ్యాం నవీన్ (ఏ1), బయ్యాం ఆరవపల్లి (ఏ2), బయ్యాం ధనమ్మ (ఏ3) కలిసి యాకస్వామిపై దాడికి పాల్పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో ఆధారాలు లభించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో ముగ్గురు నిందితులను



అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి సంఘటనా స్థల పరిశీలన, పంచనామా, పోస్టుమార్టం తదితర చట్టపరమైన ప్రక్రియలను పోలీసులు చేపట్టారు. హత్యకు సంబంధించిన ఆధారాలను సేకరించడంతో పాటు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. నేరానికి పాల్పడిన ఎవరినీ చట్టం నుంచి తప్పించుకోనివ్వకుండా, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# బాలలకు చేస్తున్న సేవలకు గుర్తించి సేవ విభూషణ్ అవార్డు ఇచ్చిన ప్రభుత్వం

**భువనగిరి,సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ బాలల హక్కుల కొరకు పోరాటం,చేస్తున్న సామాజిక వేత్త ఉద్యమ కారుడు పులిగుజ్జ సైదులు, చేస్తున్న సేవలను గుర్తించి జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్,ప్రభుత్వం ద్వారాఅప్రిసియేషన్ సర్టిఫికెట్ మరియు అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతు తెలంగాణ బాలల హక్కుల కోసం పోరాటం చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడి గా నా సేవలను గుర్తించి సేవా విభూషణ్ అవార్డ్-2026 ను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జి సి ఎస్ వల్లూరి ఫౌండేషన్ ద్వార ప్రత్యేక ఆహ్వానం తో పిలిచి ఇవ్వడం చాలా సంతోశం గా ఉందని ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.







# మొక్కలు నాటడమే కాదు.. కాపాడటం అందరి బాధ్యత

## - కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్

**ఆలేరు సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**



భూమిని కాలుష్య రహితంగా మార్చడానికి, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆలేరు మున్సిపాలిటీ ఒకటవ వార్డ్ కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ పిలుపునిచ్చారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని వార్డులో మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలతో కలిసి ఆమె మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారే వరకు నీరు పోసి, ట్రీగార్డులు ఏర్పాటు చేసి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పచ్చని చెట్లతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలలో మొక్కలు నాటాలని కోరారు. ఆలేరు మున్సిపాలిటీని పచ్చదనంతో మరియు ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు వార్డు ప్రజలు, కాలనీ సంఘాలు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ప్రతినిధులు, కాలనీ పెద్దలు మరియు స్థానిక మహిళలు, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

## - భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి: ఎస్సై తేజస్విని



**నడిగూడెం, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి:**

వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు ముందస్తుగా పోలీసుల అనుమతి పొందాలని నడిగూడెం ఎస్సై తేజస్విని సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. పోలీసుల అనుమతి తీసుకున్న అనంతరం మాత్రమే మండపాల ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. వినాయక మండపాల వద్ద డీజే సౌండ్‌కు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఉత్సవాల పేరుతో అశ్లీల నృత్యాలు, అసభ్యకరమైన పాటలు నిర్వహించరాదని హెచ్చరించారు. భక్తిశ్రద్ధలకు, సంప్రదాయాలకు అనుగుణంగా ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవ కమిటీలు సహకరించాలని కోరారు. పోలీసుల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై తేజస్విని హెచ్చరించారు.

# వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి

## - డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు

**ఆలేరు సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి)**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని పలు గ్రామాలలో వినాయక మండపాల వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని మహాలక్ష్మి ఫంక్షన్ హాల్లో రెవిన్యూ అధికారులకు విద్యుత్ అధికారులకు గ్రామాల సర్పంచులకు అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. గ్రామానికి ఒక విద్యుత్ అధికారి ఉంటాడు వారిని సంప్రదించాలన్నారు. మండపం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ శంకర్ గౌడ్, ఎస్ ఐ కుమారస్వామి,ఎమ్మార్వో విద్యుత్ ఏఈ పలు గ్రామాల సర్పంచులు పోలీస్ సిబ్బంది.





# బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

## - బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు

**గరిడేపల్లి,సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):**

ఇతర పార్టీలు బీజేపీపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.గరిడేపల్లి మండల కేంద్రంలో శనివారం ఆయన ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంతో పాటు, రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.ఈ సందర్భంగా ఓబీసీ,ఎస్సీ,ఎస్టీ,కిసాన్, మైనార్టీ,మహిళా మోర్చా, బీజేవైఎం తదితర మోర్చాల అధ్యక్షులను ఎన్నుకున్నారు.సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలం లోని ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని వెంకటేశ్వర్లు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎడవల్లి చంద్ర శేఖర్‌రెడ్డి,జనిగల శ్రీనివాస్ గౌడ్, అనంతు గురువయ్యగౌడ్, చిత్తలూరి సోమయ్యగౌడ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా ఉద్యమాల యోధుడు సీతారాం ఏచూరి!

## వామపక్ష సిద్ధాంతాల పరిరక్షణలో ఆయన పోరాటం చిరస్మరణీయం

**నడిగూడెం, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి:**

సీపీఎం పార్టీ పూర్వ జాతీయ ప్రధాన కార్యదర్శి, కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలు, ప్రజా ఉద్యమాల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని సీపీఎం నాయకులు అన్నారు. సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బెల్లకొండ సత్యనారాయణ మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి దేశంలో ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సామాజిక న్యాయం, కార్మికులు, రైతులు, పేదల హక్కుల కోసం నిరంతరం పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. వామపక్ష ఉద్యమానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఏచూరి చూపిన ప్రజా ఉద్యమాల మార్గంలో ముందుకు సాగుతూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బీరవల్లి సుధాకర్ రెడ్డి, లతీఫ్ బాబు, పిచ్చయ్య, శాఖ కార్యదర్శి రెంటాల శ్రీను, బొడ్డు బాలకృష్ణ, కందుల సంజీవరావు, మీట్టకడుపుల శ్రీను, వెంకన్న తదితర సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొని సీతారాం ఏచూరికి నివాళులర్పించారు.



# జన్మదిన సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న చెర్వుగట్టు సర్పంచ్ నేతకాని కృష్ణయ్య

**నార్కట్ పల్లి , సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):**

నార్కట్ పల్లి మండలంచెర్వుగట్టు గ్రామ సర్పంచ్ నేతకాని కృష్ణయ్య తన జన్మదినాన్ని పురస్కరించుకుని, చెర్వుగట్టు శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామివారి కరుణాకటాక్షాలు చెర్వుగట్టు గ్రామ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ వారాల రమేష్ , మాజీ చైర్మన్ రేగట్టే రాజశేఖర్ రెడ్డి , ఉప సర్పంచ్ అమనగంటి జలంధర్ రెడ్డి ,జిల్లానాయకులు రేగట్టే నవీన్ రెడ్డి , వార్డు సభ్యులు రేగట్టే లక్ష్మమ్మ నర్సిరెడ్డి , ధర్మకర్తలు మందుల నరసింహ, రంగ శ్రవణ్, గౌరిదేవి లక్ష్మయ్య, ఇడుపుల సంపత్, మాజీ వార్డు మెంబర్ గంట శేఖర్, చీర లింగయ్య, బాలం జంగలు, గాదరి శంకర్, భీంపాక శంకర్, కొమ్ము మహేష్, వంటేపాక శేఖర్, వనం సతీష్, కట్ట సాయి, కట్ట శివాజీ ,తదితరులు పాల్గొన్నారు.



# ఫిన్లాండ్ విద్యా పర్యటనకు సైదులు ఎంపిక

**ఆలేరు సెప్టెంబర్ 12 ప్రజా జ్యోతి**

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న టీచర్స్ ఎక్స్పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం ఫిన్లాండ్ కు యాదాద్రి భువనగిరి జిల్లా పీఎం జెడ్పీహెచ్ఎస్ ఆలేరు బాలుర పాఠశాలకు చెందిన ఆర్ సైదులు ఎంపికయ్యారు. పాఠశాల విద్యలు అంతర్జాతీయ స్థాయి ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడం ఉపాధ్యాయుల వృత్తిపరమైన సామర్థ్యాలను మరింత పెంపొంది చడం ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న ఆధునిక విద్య పద్ధతులను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.



# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

-ఎ డీజేలకు అనుమతి లేదు.. నిబంధనలు ఉల్లంఘిస్తే

చర్యలు: సిఐ మొగులూరు రవి

**వలిగొండ సెప్టెంబర్ 12(ప్రజాజ్యోతి న్యూస్):**



గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని రామన్నపేట సీఐ మొలుగూరి రవి, వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. యాదాద్రి- భువనగిరి జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా డీజేలకు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీసుల సూచనలు పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.




# పిచ్చయ్య మృతి.. చివరి వీడ్కోలుకు తరలివచ్చిన జనం

**నూతనకల్, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**



మండల కేంద్రానికి చెందిన పూసపాటి పిచ్చయ్య మృతి నూతనకల్ గ్రామానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి ఘన నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతిమ యాత్రలో పాల్గొని పాడెమోశారు.. అనంతరం వారు మాట్లాడుతూ.. పిచ్చయ్య కాంగ్రెస్ పార్టీకి గ్రామానికి ఎనలేని సేవ చేశారని కొనియాడారు... కుక్కింగ్ మాస్టర్ గా మంచి గుర్తింపు తెచ్చుకొని ప్రజలలో తనదైన శైలిలో ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. పిచ్చయ్య అంతిమ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని కడసారి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు నాగం సుధాకర్ రెడ్డి, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మహేశ్వరం చంద్రకళ, గ్రామ శాఖ అధ్యక్షులు బొడ్డుపల్లి అంజయ్య, నాయకులు బండపల్లి సాగర్, కల్లెం కృష్ణారెడ్డి, జహంగీర్, చురకంటి చంద్రారెడ్డి, దేవిరెడ్డి నర్సిరెడ్డి, భూరెడ్డి సంజీవరెడ్డి, ఇమ్మారెడ్డి మల్లారెడ్డి, జటంగి గణేష్ యాదవ్, ఇమ్మారెడ్డి మహేష్ రెడ్డి, మేడిపల్లి అశోక్, మద్దెల సురేందర్, పగిళ్ల అశోక్ రెడ్డి, బండపల్లి చందు, నెల్లుట్ల మహేష్, బండపల్లి మహేష్, బయ్య గణేష్, విఠల్ రెడ్డి, ఉప్పుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 12,283 కేసుల పరిష్కారం..

- 14 బెంచీల ఏర్పాటు.. బాధితులకు త్వరిత న్యాయం..
- ప్రమాద బాధితులకు రూ.7.62 కోట్లకు పైగా నష్టపరిహారం..
- జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. వసంత్










**నల్లగొండ, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి):**

ప్రజలకు సత్వర న్యాయం అందించడంతో పాటు పెండింగ్ కేసులకు సామరస్యపూర్వక పరిష్కారం చూపే లక్ష్యంతో నిర్వహించిన మూడవ జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. వసంత్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రజల సౌకర్యార్థం 14 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసి మొత్తం 12,283 పెండింగ్, ప్రీ-లిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు.శనివారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్లగొండ కోర్టు ప్రాంగణంతో పాటు జిల్లా వ్యాప్తంగా 3వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి పి. వసంత్ మాట్లాడుతూ... జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు పరస్పర అవగాహనతో వివాదాలను పరిష్కరించుకోవచ్చని, సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరు పక్షాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో 33 సివిల్ కేసులు, 2,813 క్రిమినల్ కేసులు, 68 మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, 9,281 ట్రాఫిక్ చలాన్ కేసులు, 77 బ్యాంకు రికవరీ కేసులు, 11 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు.మోటారు వాహన ప్రమాద బీమా కేసుల్లో బాధితులకు రూ.7,62,44,348 నష్టపరిహారం ఇప్పించగా, బ్యాంకు రికవరీ కేసుల్లో రూ.62,17,000, ట్రాఫిక్ చలాన్ కేసుల్లో రూ.31,32,180, సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.1,17,262 రికవరీ చేయించినట్లు పేర్కొన్నారు. ప్రజలు చిన్నచిన్న వివాదాలను కోర్టుల్లో సంవత్సరాల తరబడి కొనసాగించకుండా, లోక్ అదాలత్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార వేదికలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి పి. వసంత్ సూచించారు. లోక్ అదాలత్ తీర్పులు ఇరుపక్షాల అంగీకారంతో వెలువడతాయని, త్వరితగతిన న్యాయం పొందేందుకు ఇది ఎంతో ఉపయోగకరమైన విధానమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హిమబిందు గొల్ల, ఇతర న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. సతీష్ కుమార్, కార్యదర్శి బి. అశోక్ కుమార్,న్యాయవాదులు, బ్యాంకులు, బీఎస్ఎన్ఎల్, ఇతర ఆర్థిక సంస్థల అధికారులు, కక్షిదారులు, డి ఎల్ ఎస్ ఎ సూపరింటెంట్, స్వర్ణలత,జిల్లా కోర్టు నాజర్ గిరిధర్, ప్రభాకర్, అనిత మరియు పి ఎల్ వీలు బోగరి రామకృష్ణ శ్రీకాంత్ షబ్బీర్ అలీ యాదమ్మ, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా జ్యోతి' కథనానికి స్పందన
# నకిలీ సిమెంట్ గుట్టురట్టు

## - తూప్రాన్‌పేట్, లక్కారంలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు
## - 107 రీ-ప్యాకింగ్ బస్తాలు స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు
## - నాసిరకం సిమెంట్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు: సీఐ

**చౌటుప్పల్, సెప్టెంబరు 12 (ప్రజా జ్యోతి):**
చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్‌తో పాటు పురపాలిక పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న నకిలీ సిమెంట్ రీ-ప్యాకింగ్ దందాపై 'ప్రజా జ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన పరిశోధనాత్మక కథనం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. "రహస్య స్థావరాల్లో 'నకిలీ' సిమెంట్ దందా!" శీర్షికన వెలువడిన సమగ్ర కథనానికి చౌటుప్పల్ పోలీస్ యంత్రాంగం తక్షణమే స్పందించింది. నిర్మాణ రంగాన్ని దెబ్బతీస్తూ, భవనాల నాణ్యతను ప్రమాదంలోకి నెడుతున్న ఈ అక్రమ వ్యాపారంపై సీఐ మన్మథ కుమార్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు శనివారం ఉదయం నుంచే మండలంలోని అనుమానిత స్థావరాలపై మెరుపు దాడులతో విరుచుకుపడ్డాయి.

**- రెండు రహస్య స్థావరాలపై మెరుపు దాడులు**

తూప్రాన్‌పేట్ శివారులోని నిర్మానుష్య ప్రదేశంలో ఏర్పాటు చేసిన ఓ రహస్య షెడ్డుపై పోలీసులు మొదట ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఎవరికీ అనుమానం రాకుండా ప్రముఖ బ్రాండ్ల ఖాళీ సంచుల్లో రీ-ప్యాకింగ్ చేసి మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉంచిన 25 బస్తాల సిమెంట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చౌటుప్పల్ పురపాలిక పరిధిలోని లక్కారం, తంగడివనం సమీపంలో గల మరో రహస్య స్థావరంపై తనిఖీలు చేపట్టారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన మరో 82 బస్తాల నాసిరకం సరుకును గుర్తించి సీజ్ చేశారు. రెండు చోట్లా కలిపి మొత్తం 107 నకిలీ సిమెంట్ బస్తాలను జప్తు చేసి స్టేషన్‌కు తరలించారు.

**- రిజెక్టెడ్ సరుకుతో మోసం.. ఇద్దరిపై కేసు నమోదు**


ప్రజాజ్యోతి
12 Sep 2026 - Page 7

# ...హస్య స్థావరాల్లో 'నకిలీ' సిమెంట్ దందా!

## ...ట్యాంకర్లలో నాసిరకం సరుకు.. పాత సంచుల్లో కేజీల లెక్కన రీ-ప్యాకింగ్
## - ఇటుకల తయారీతో పాటు ప్రభుత్వ పనులకే వాడేస్తున్న అక్రమార్కులు
## - కమీషన్ల కక్కుర్తితో ప్రజాధనం లూటీ.. చోద్యం చూస్తున్న యంత్రాంగం

సిమెంట్ ట్యాంకర్ల నుండి పాత బ్యాగుల్లోకి... అక్రమ దండ జోరు!

వివిధ కర్మాగారాల్లో నాణ్యతా పరీక్షల్లో విఫలమై, కంపెనీలు తిరస్కరించిన లూస్ (బల్క్) సిమెంట్‌ను కేటుగాళ్లు గుట్టుగా ట్యాంకర్ల ద్వారా తక్కువ ధరకు కొనుగోలు చేసి తెప్పిస్తున్నారు. ఆ సరుకును రహస్య షెడ్లలో పోసి, మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉన్న ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల పాత సంచుల్లో నింపి సాధారణ వినియోగదారులకు అసలైన సిమెంట్‌గా విక్రయిస్తున్నారు. ఈ మోసపూరిత దందాకు పాల్పడుతున్న దేశగోని సుధాకర్, గుండాల శీను అనే ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.





**- కఠిన చర్యలు తప్పవు: సీఐ మన్మథ కుమార్**

నాణ్యతా ప్రమాణాలు లోపించిన నాసిరకం సిమెంట్‌ను రీ-ప్యాక్ చేసి విక్రయించినా, కమీషన్ల కక్కుర్తితో ప్రభుత్వ పనులకు, భవన నిర్మాణాలకు, ఇటుకల తయారీకి వినియోగించినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని సీఐ మన్మథ కుమార్ హెచ్చరించారు. ఇలాంటి అక్రమ రీ-ప్యాకింగ్ కేంద్రాలు, నకిలీ సరుకు గురించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అక్రమ దందాను వెలుగులోకి తెచ్చి ప్రజలను అప్రమత్తం చేయడంలో కీలక పాత్ర పోషించిన 'ప్రజా జ్యోతి' కథనంపై స్థానిక ప్రజలు, బిల్డర్లు, నిర్మాణ రంగ నిపుణులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# లక్కారంలో 19న 'మెగా జాబ్ మేళా'

## - హాజరుకానున్న 70కి పైగా ప్రముఖ కంపెనీలు - యువత సదవకాశాన్ని వినియోగించుకోవాలి: ఇరుగదిండ్ల భాస్కర్



**చౌటుప్పల్, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి) :**

నిరుద్యోగ యువత ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ఛైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ పిలుపునిచ్చారు.చౌటుప్పల్ మండల పరిధిలోని లక్కారంలో గల వి.వి.ఆర్. గార్డెన్స్‌లో ఈ నెల 19న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'మెగా జాబ్ మేళా' నిర్వహిస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ మేళాకు 70కి పైగా ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై, అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు.పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, బీటెక్, ఫార్మసీ ఉత్తీర్ణులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎంపికలకు హాజరయ్యే వారికి ప్రవేశం పూర్తిగా ఉచితమని స్పష్టం చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 95508 43338 నంబరును సంప్రదించాలని పేర్కొన్నారు.

# సర్ ప్రక్రియపై జాప్యం వద్దు.. త్వరతగతిని పూర్తి చేయాలి: జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్..

**నూతనకల్, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):**



మండలంలో జరుగుతున్న సర్ 2026 ప్రక్రియలో భాగంగా ఓటర్లకు జారీ చేసిన నోటీసుల పరిష్కారం, స్వీకరణ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ , ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి బి.హరిసింగ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని 166 నుండి 171 నెంబర్లు గల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.. అనంతరం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న నోటీసుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో చేర్చడంతో పాటు మార్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూశించారు.. సర్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా నిబంధనల మేరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.. ప్రత్యేక ప్రచార దినాలను సద్వినియోగం చేసుకొని పెండింగ్ దరఖాస్తులు, నోటీసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని వారు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాసరావు, సంబంధిత రెవిన్యూ అధికారులు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

## - నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలి.. - డీఎస్పీ కె. శివరాం రెడ్డి

**నల్గొండ సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి):**

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాలను నిర్వహించనున్న నిర్వాహకులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి మాట్లాడుతూ..గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడరాదని, పోలీసు శాఖ సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించి పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆదిరెడ్డి, వన్‌టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసు అధికారులు, మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, వివిధ మతాల పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.







# పోలింగ్ కేంద్రాల్లో తహసీల్దార్ తనిఖీలు!

## - స్థానికంగా లేని ఓటర్లకు నోటీసులు - ఈనెల 15లోపు ధ్రువపత్రాలు సమర్పించాలి..

**నడిగూడెం, సెప్టెంబర్ 12, ప్రజా జ్యోతి:**

ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా మండల కేంద్రమైన నడిగూడెంలోని రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు బృందావనపురం గ్రామంలోని మరో రెండు పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ ఎల్. మంగ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానికంగా నివసించని ఓటర్ల వివరాలను పరిశీలించి, వారికి నోటీసులు జారీ చేశారు.నోటీసులు అందుకున్న వారు ఈనెల 15వ తేదీలోపు తాము స్థానికంగా నివసిస్తున్నట్లు నిర్ధారించే తగిన ధ్రువపత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించాలని తహసీల్దార్ సూచించారు. నిర్ణీత గడువులోగా ఆధారాలు సమర్పించని వారి ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.స్థానికంగా నివసించని ఓటర్లు నోటీసులు స్వీకరించి, అధికారుల పరిశీలనకు సహకరించాలని కోరారు. గడువు ముగిసిన తర్వాత ఎలాంటి ఆధారాలు సమర్పించినా పరిశీలనకు అవకాశం ఉండదని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న బీఎల్ఓలకు ఓటర్ల వివరాల పరిశీలన, నోటీసుల జారీ తదితర అంశాలపై తహసీల్దార్ పలు సూచనలు చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్ఓలు పాల్గొన్నారు.



# కనుముక్కుల్లో కోట మల్లారెడ్డికి అశ్రునివాళి

# కోట మల్లారెడ్డి దశదినకర్మకు బీఆర్ఎస్ అగ్రనేతలు







**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి):** మండలంలోని కనుముక్కుల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కోట మల్లారెడ్డి దశదినకర్మ కార్యక్రమం శనివారం కనుముక్కుల గ్రామంలో నిర్వహించారు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కోట మల్లారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు ఎలిమినేటి ఉమా మాధవరెడ్డి, గుంటకండ్ల జగదీశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి తదితరులు దశదినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. కోట మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారని పలువురు నాయకులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. గ్రామం, మండల స్థాయిలో పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తమకు తీరని లోటని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మాజీ జడ్పీ చైర్మన్లు కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నంద్యాల దయాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, పార్టీ నాయకులు రావుల శేఖర్‌రెడ్డి, పగిళ్ల సుధాకర్‌రెడ్డి, నోముల మాధవరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ పడమటి మహిపాల్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. రైస్ మిల్లర్స్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, మాజీ సర్పంచులు, కౌన్సిలర్లు, వివిధ స్థాయిలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కోట మల్లారెడ్డి అభిమానులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దశదినకర్మ సందర్భంగా గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. కోట మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులను నాయకులు పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

# గణేష్ నిమజ్జనానికి సర్వం సిద్ధం..!

## - అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్ల పరిశీలన..
## - నిమజ్జన శోభాయాత్రకు పకడ్బందీ ఏర్పాట్లు..
## - ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి..
## - డిఎస్పీ కె. శివరాంరెడ్డి



**నల్గొండ సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి):** రానున్న గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకుని నల్గొండ పట్టణంలో చేపడుతున్న ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులతో కలిసి నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలీస్, మున్సిపల్ కార్పొరేషన్, రెవెన్యూ, విద్యుత్, ఆర్అండ్‌బీ, వైద్య, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో కలిసి నిమజ్జన శోభాయాత్ర సాగే మార్గాన్ని పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, రహదారుల పరిస్థితి, విద్యుత్ సౌకర్యాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, బందోబస్తు, అగ్నిమాపక, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిమజ్జన కార్యక్రమం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని డీఎస్పీ సూచించారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు, ప్రజలు కూడా అధికారులకు సహకరిస్తూ





శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గాజుల అభినవ్ రాజ్ సంస్మరణ సభలో పాల్గొన్న డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి

**దేవరకొండ, సెప్టెంబర్ 12,(ప్రజా జ్యోతి) :** దేవరకొండ పట్టణంలోని డిండి రోడ్డులో గల సాయి శివ గార్డెన్‌లో నిర్వహించిన గాజుల రాజేష్ కుమారుడు, దివంగత గాజుల అభినవ్ రాజ్ సంస్మరణ సభలో టి పి సి సి సభ్యులు మరియు పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి అభినవ్ రాజ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన గాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిండు నూరేళ్లు వర్ధిల్లాల్సిన యువకుడు అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని, అభినవ్ రాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు.





# ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి



**మునగాల సెప్టెంబర్12 (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలోని ముకుందపురం గ్రామంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పక్కనే ఉన్న ముత్యాల కెనాల్ లో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు గల్లంతు అయ్యారు.







మూడు రోజులు సెలవు దినాలు కావడం తో ముకుందపురం గ్రామం లో తమ తోటి విదార్ధి అనుదీప్ ను కలవడానికి కోదాడ పట్టణానికి చెందిన హరీష్ నాయుడు, గుదిబండ గ్రామానికి చెందిన లేక స్వరూప్ లు వచ్చి తన స్నేహితుడితో కలిసి కెనాల్ లో ఈతకు దిగారు.ముగ్గురిలో హరీష్ నాయుడు, స్వరూప్ గల్లంతు కాగా అనుదిప్ ను స్థానికులు రక్షించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది నాలుగు గంటలకు శ్రమించి మృతదేహాలను వెలికి తీశారు.ఈ ఘటనతో ముకుందమపురం లో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న తల్లి దండ్రులు, బంధువులు శోక సంద్రంలో మునిగారు.

---

# శాలిగౌరారం చెరువు లీజులపై మత్స్యకారుల ఆందోళన

## - అక్రమ లీజులను అడ్డుకోవాలని డిమాండ్..

## కలెక్టరేట్ ఎదుట ధర్నాకు హెచ్చరిక

**నల్లగొండ, సెప్టెంబర్ 12: (ప్రజా జ్యోతి ప్రతినిధి)**

శాలిగౌరారం పెద్ద చెరువు లీజు విషయంలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మత్స్యకార సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, మత్స్యశాఖ బైలా నిబంధనలకు విరుద్ధంగా చెరువును బయటి వ్యక్తులకు లీజుకు ఇస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన ఎల్.వి. రమణ ముదిరాజ్‌పై కొందరు కుట్రపూరిత ప్రచారం చేయడాన్ని సొసైటీ సభ్యులు ఖండించారు.చెరువులను బయటి వ్యక్తులకు, దళారులకు లీజుకు ఇవ్వడం వల్ల మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని వారు పేర్కొన్నారు. చేపల విక్రయాల ద్వారా వచ్చే అసలు ఆదాయం మత్స్యకారులకు దక్కకుండా, వారికి నామమాత్రపు కూలీ మాత్రమే లభిస్తోందని ఆరోపించారు. చెరువులో లభించే చేపలను సొసైటీ సభ్యులే నేరుగా మార్కెట్‌లో విక్రయిస్తే ప్రతి మత్స్యకార కుటుంబానికి మెరుగైన ఆదాయం లభిస్తుందని తెలిపారు.

జిల్లా మత్స్యకారుల సొసైటీ అధ్యక్షుడు కనుకు వెంకట నారాయణ్ వ్యవహారశైలిపైనా సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. రమణ ముదిరాజ్‌కు వ్యతిరేకంగా వచ్చిన వార్తా కథనాలను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడం బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి తగదని అన్నారు.చెరువును నిబంధనలకు విరుద్ధంగా లీజుకు ఇస్తున్నట్లు చెరువు పాలకమండలి కమిటీ సభ్యులు మాట్లాడిన వీడియో ఆధారాలు తమ వద్ద ఉన్నాయని సొసైటీ సభ్యులు తెలిపారు. సంబంధిత ఆధారాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.అక్రమ లీజుల వ్యవహారాన్ని వెంటనే అడ్డుకోకపోతే సుమారు 250 మంది సొసైటీ సభ్యులు, వారి కుటుంబ సభ్యులతో కలిపి 500 మందికి పైగా నల్లగొండ కలెక్టరేట్ ఎదుట ఎల్.వి. రమణ ముదిరాజ్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. మత్స్యకారుల హక్కులను పరిరక్షించి, చెరువు లీజు



వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు.

# నకిరేకల్‌లో బీఎస్6 వాహనాలపై ఉచిత శిక్షణ

నకిరేకల్: సెప్టెంబర్ 12 (ప్రజాజ్యోతి)

నకిరేకల్ మండలంలోని టూ వీలర్ మెకానిక్‌లకు క్యాస్టల్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ వినాయక్ బాంకెట్ హాల్‌లో బీఎస్6 టూ వీలర్ వాహనాలపై ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెకానిక్‌లకు బీఎస్6 వాహనాల సాంకేతిక అంశాలపై శిక్షణ అందించారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న మెకానిక్‌లకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ టూ వీలర్ యూనియన్ అధ్యక్షుడు నరసింహచారి, ఉపాధ్యక్షుడు జానకిరాములు, ఆకుల నాగయ్య, లక్ష్మయ్య, పేర్ల సురేష్, నయీమ్, జాల ఉపేందర్, దొడ్డోని సైదులు, చెన్న రవిచంద్ర, భువనగిరి ధనుంజయ, గుండా శ్రీనివాస్ రెడ్డి, గద్దగూటి నరేష్, రవిచంద్రతో పాటు పలువురు మెకానిక్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఉచిత శిక్షణ అందించిన క్యాస్టల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు మెకానిక్‌లు కృతజ్ఞతలు తెలిపారు.



# రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు హాలియా క్రీడాకారిణులు

హాలియా,సెప్టెంబర్12(ప్రజా జ్యోతి)

ఉమ్మడి నల్గొండ జిల్లా సబ్‌జూనియర్,జూనియర్ బాలికల నెట్‌బాల్ జట్ల ఎంపికలు శుక్రవారం హాలియా పట్టణంలోని శ్లోక పాఠశాలలో నిర్వహించారు.ఈ ఎంపిక కార్యక్రమానికి హాలియా ఎస్ఐ బి.ప్రశాంత్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ,జట్టు స్ఫూర్తి,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్రీడాకారులు కష్టపడి సాధన చేస్తే తమ జిల్లాకు మంచి పేరు తీసుకురావచ్చని,ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఎంపికైన సబ్‌జూనియర్, జూనియర్ బాలికల నెట్‌బాల్ జట్లు అక్టోబర్ 10,11,12 తేదీలలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొననున్నాయి. అదేవిధంగా బాలుర విభాగంలో సబ్‌జూనియర్,జూనియర్ నెట్‌బాల్ పోటీలు అక్టోబర్ 12, 13,14 తేదీలలో మేడ్చల్ జిల్లాలో జరగనున్నాయి.ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి కిరణ్ కుమార్, హాలియా జెడ్పీహెచ్ఎస్ పీఈటీ వెంకట్ రామ్ రెడ్డి,పీఈటీలు రాంబాబు,మంగ్యా,అనిల్, చంద్రశేఖర్,రవి తదితరులు పాల్గొన్నారు.



# వినాయక చవితికి 400 విగ్రహాల వితరణ

హుజూర్ నగర్ సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)



నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు పిల్లుట్ల రఘు ఆధ్వర్యంలో 400 వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్‌రెడ్డి ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రఘు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా నియోజకవర్గంలోని గ్రామాలకు ఉచితంగా వినాయక విగ్రహాలను అందిస్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వినాయక చవితి వేడుకలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి భక్తి, సన్మార్గంలో నడిచేలా ప్రోత్సహించడమే కార్యక్రమం లక్ష్యమన్నారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు న్యాయవాది నగేష్‌రాథోడ్, ములకలపల్లి రాంబాబు, కోలపూడి చంటి, కొణతం లచ్చిరెడ్డి, లావుడియా శ్రీను, జడ అంజి, గరిడేపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గుగులోతు కృష్ణ, మాజీ జడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్, నేరేడుచర్ల మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# బస్సుల్లో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళా ముఠా అరెస్ట్



రామన్నపేట, సెప్టెంబర్ 12 (ప్రజా జ్యోతి)

బస్ స్టాండ్ లో రద్దీని ఆసరాగా చేసుకుని బస్సు ఎక్కే మహిళల మెడలోని బంగారు నగలను దొంగిలిస్తున్న మహిళా ముఠాను రామన్నపేట పోలీసులు అరెస్ట్ చేశారు.సీఐ రవి, ఎస్ఐ సతీష్ ఆధ్వర్యంలో రామన్నపేటలో వాహన తనిఖీలు చేస్తుండగా, స్విఫ్ట్ డిజైర్ కారు ఏపీ 40 జేఈ 6238 లో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది.ఆంధ్రప్రదేశ్, బాపట్ల జిల్లా చీరాల మండలానికి చెందిన కావడి తిరివేలు, ఆమె చెల్లెలు కర్రెద్దుల మరియమ్మ, పెద్దనాగూరుతూరు కావడి మహంకాళి ఏ లక్ష్మి, చౌటబాను ప్రసాద్ గా గుర్తించారు. వీరు ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో ఈనెల 4వ తేదీన చీరాల నుండి బయలుదేరి దాచేపల్లిలో బస చేసి, మరుసటి రోజు హైదరాబాద్ హయత్ నగర్ లోని మహంకాళి అద్దె ఇంటికి చేరుకున్నారు.ఈనెల 7వ తేదీన చౌటుప్పల్ బస్ స్టాండ్ లో రద్దీగా ఉన్న సమయంలో హైదరాబాద్ వెళ్లే బస్సు ఎక్కుతున్న ఓ మహిళ నుండి 7.5 గ్రాముల చిన్న చెవికమ్మలు, 15 గ్రాముల పెద్ద కమ్మలు, 2.5 గ్రాముల రెండు ఉంగరాలు, 20 గ్రాముల రెండు గొలుసులు అపహరించారు.మరుసటి రోజు అదే బస్ స్టాండ్ లో రామన్నపేట వైపు వెళ్తున్న బస్సులో పల్లివాడ గ్రామానికి చెందిన నాంపల్లి రామనర్సమ్మ మెడలోని 82.5 గ్రాముల బంగారు మంగళసూత్రాన్ని దొంగిలించి, వెనుకే వస్తున్న తమ కారులో పరారయ్యారు. రెండు రోజులు హయత్ నగర్ లోనే ఉండి శనివారం తిరిగి చీరాలకు బయలుదేరారు.పంతంగి టోల్ గేట్ తప్పించుకునేందుకు చౌటుప్పల్ – నాగారం – రామన్నపేట మీదుగా వెళ్తుండగా పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారు.వారి నుండి 32.5 గ్రాముల పుస్తెలతాడు, 40 గ్రాముల బంగారు నగలు, స్విఫ్ట్ డిజైర్ కారు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# సామాజిక బాధ్యత చాటుకున్న డాక్టర్ మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు

## - నిరుపేద ఎంబిబిఎస్ విద్యార్థులకు రూ 50 వేల ఆర్థిక సహాయం, పుస్తకాలు అందజేత

## - నిరుపేద విద్యార్థులకు సమాజం కూడా తమ వంతు సహకారం అందించాలంటూ పిలుపు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి):**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో గత 30 సంవత్సరాలుగా నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తూ ఎంతోమందికి ప్రాణదానం చేసిన విజయ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ లు మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు తమ సామాజిక బాధ్యతను మరోసారి చాటుకున్నారు. ఇటీవల పెన్పహాడ్ మండలం అనంతారం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థులు భీపంగ యశ్వంత్ నీట్ లో 1301 ర్యాంకు సాధించి ఉస్మానియాలో, మామిడి ఇందు నీట్ లో 10150 ర్యాంకుతో గాంధీ హాస్పిటల్లో ఎంబిబిఎస్ సీట్లు సాధించడం పట్ల అభినందిస్తూ ఒక్కొక్కరికి రూ :25 వేల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు మొదటి సంవత్సరానికి ఉపయోగపడే పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మిన్న శివరామకృష్ణ విజయలక్ష్మి దంపతులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థులు ఉన్నత వైద్య విద్యలో సీటు సాధించడం ఆనందంగా ఉందన్నారు. వారు ఇరువురు పేదరికంలో ఉన్నారని చదువుకునేందుకు పేదరికం అడ్డుకాకూడదని ఆలోచనతో తాము ఈ ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు. సమాజం కూడా స్పందించి వారి వైద్యవిద్యకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సరాలలో కూడా ఇరువురి విద్యార్థులకు కావలసిన సహాయ సహకారాలను తమ ద్వారా అందజేస్తామన్నారు. డాక్టర్ దంపతుల దాతృత్వం పట్ల విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందించిన సహకారాన్ని సద్వినియోగం చేసుకొని వైద్యవిద్యను విజయవంతంగా పూర్తి చేసి



నిరుపేదలకు వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామన్నారు.

# సూర్యాపేటలో జెవిఆర్ ఈ-బైక్స్ షోరూమ్ ప్రారంభం

## పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలనే వాడాలి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 12(ప్రజా జ్యోతి):**

భవిష్యత్తు అంతా ఎలక్ట్రిక్ వాహనాలదే అని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ రావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్డులో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెవిఆర్ ఈ మొబిలిటీ ఎలక్ట్రికల్ బైక్ షోరూంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్,నిర్వహణ తక్కువ ఖర్చు ఉండటంతో వాహనదారులు ఎలక్ట్రికల్ వాహనాల వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. ప్రపంచానికి పర్యావరణ కాలుష్యం ముప్పుగా మారిన నేపథ్యంలో విద్యుత్ వాహనాల వాడకం తప్పనిసరైందని అన్నారు. వాహనదారులకు నాణ్యమైన సేవలను అందించి వ్యాపారంలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం జెవిఆర్ ఈ బైక్స్ ఎండీ శింగంశెట్టి నీరజ ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ తమ కంపెనీ ఎలక్ట్రిక్ బైక్స్ ను సామాన్యులకు అందుబాటులో ఉండేలా, పర్యావరణ హితమైన, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో తయారు చేసినట్లు తెలిపారు. వాహనదారులు తమ కంపెనీ ఎలక్ట్రికల్ వాహనాలను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెవిఆర్, రామసాని శ్రీనివాస నాయుడు, దంతాల రాంబాబు, మాజీ ఎంపీపీ లక్ష్మిరామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, మౌనిక, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.





# కల్టివా క్రాప్ క్లినిక్ అగ్రికల్చర్ స్టోర్ ప్రారంభించిన :కీసర సంతోష్ రెడ్డి

**మోతె సెప్టెంబర్12(ప్రజాజ్యోతి )**

మండల పరిధిలోని రాఘవాపురం ఎక్స్ రోడ్‌లో కల్టివా క్రాప్ క్లినిక్ ఆధ్వర్యంలో నూతన అగ్రికల్చర్ స్టోర్‌ను శనివారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు సంతోష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ...కల్టివా క్రాప్ క్లినిక్ కంపెనీ యాజమాన్యం రైతులకు ఆర్గానిక్ వ్యవసాయం ప్రాధాన్యత, కల్టివా క్రాప్ క్లినిక్ ఉత్పత్తుల ప్రయోజనాలు, వ్యవసాయంలో వాటి వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఆధునిక,సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించే విధంగా అవసరమైన సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు కోల లింగయ్య, భాస్కర్ రెడ్డి,ఉప సర్పంచ్ సుజిత్ రెడ్డి, కారింగుల శ్రీనివాస్ గౌడ్,గ్రామ శాఖ అధ్యక్షుడు లింగమూర్తి,రైతులు భిక్షం, శ్రీనివాస్, కోలా వెంకన్న, రవి తదితరులు పాల్గొన్నారు.